15 రోజుల్లో టిడ్కో సమస్యలు పరిష్కరించండి

- మెప్మా పీడీ ప్రియంవద
- ఆర్పీలు, సచివాలయ అడ్మిన్లతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ప్రియంవద

సామర్లకోట: టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించేలా మెప్మా సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు బి.ప్రియంవద తెలిపారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మెప్మా ఆర్పీలు, సచివాలయ అడ్మిన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఇప్పటికే బ్యాంకు రుణం వచ్చిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలని ఆదేశించారు. లబ్ధిదారులు మృతిచెందితే వారి వారసులకు ఇళ్లు అందజేస్తామని తెలిపారు. ఇటువంటి సమస్యలు మున్సిపాలిటీలో 251 ఉన్నాయని తెలిపారు. వారు ఇళ్లు తీసుకోవడానికి సముఖత చూపకపోతే జాబితాలో తరువాత ఉన్నవారికి కేటాయిస్తామన్నారు. జిల్లా పరిధిలో కాకినాడ కార్పొరేషన్ మినహా మిగిలిన అన్ని మున్సిపాలిటీల్లోనూ టిడ్కో ఇళ్లు స్వాధీనం చేశామని ఆమె తెలిపారు. 15 రోజుల్లో టిడ్కో ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా ఏఓ శివప్రసాద్, మెప్మా ఐబీ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న వీసీ సాయి ప్రసాద్

ఇళ్లు త్వరగా అందజేయండి

పెద్దాపురం: అర్హులందరికీ టిడ్కో ఇళ్లను త్వరగా అందజేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. కాలనీ వాసులకు అవసరమైన మౌలిక వసతులు సత్వరమే కల్పించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, అధికారులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పిఠాపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణం కుమ్మరివీధి సచివాలయం–2 పరిధిలో బుధవారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని సంక్షేమంపై ఆరా తీశారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎప్పుడైన పేదల సంక్షేమం గురించి పట్టించుకున్నారా ? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అమలు చేసిన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రతీ గ్రామంలోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో గ్రామీణాభివృద్ధి


వడ్లమూరులో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వీర్రాఘవరావు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన తరువాత సుమారు 20 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ఆయన ఆదేశాల మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీర్రాఘవరావు, వైస్ ఎంపీపీ కంటే వీరప్రభావతి గ్రామంలో మంజూరైన నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గడప గడపకు మన ప్రభుత్వం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, బిక్కిన సాయి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా వర్కర్ల పోస్టుల నియామక ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్, ఆర్డీఓ జేవీఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం తుని, శంఖవరం, పెద్దాపురం, జగ్గంపేట ప్రాజెక్టుల పరిధిలోని ఆయా పోస్టుల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాజెక్టుల పరిధిలో 16 పోస్టుల కోసం అభ్యర్థులకు ముఖాముఖి పరీక్ష నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి, సీడీపీఓలు ఉష, పద్మావతి, ఏసీడీపీఓ నిహారిక, యూడీసీ బత్తుల మూర్తి తదితరులున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు


పెద్దాపురంలో జగనన్న సురక్షలో మాట్లాడుతున్న వీసీ సాయి ప్రసాద్


సామర్లకోటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు


మూలపేటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

పెద్దాపురం: మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరుల ఆధ్వర్యంలో బుధవారం తొమ్మిదో సచివాలయం పరిధిలోని 16, 17 వార్డుల్లో జగనన్న సురక్ష నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనాబీబీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందించడమే గాక ప్రజలకు అవసరమైన పౌర సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. టీపీఓ ఉమామహేశ్వరావు, మేనేజర్ జ్యోతి రాణి, కౌన్సిలర్లుర్, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కాండ్రకోటలో..

మండలంలోని కాండ్రకోట సచివాలం–2 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా తదితరులు సర్పంచ్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఈఓ పీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి బషీర్, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఎంపీటీసీ వీరబాబు, లక్కాకుల కృష్ణ, గంటా రామస్వామి, జోకా నానాజీ, గవరసాని రాజశేఖర్ పాల్గొన్నారు

మున్సిపల్ కార్యాలయంలో

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వాల పాలన, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలనను పోల్చి చూసుకోవాలని ప్రజలు ఆమె సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మెజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పనసపాడులో..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం పనసపాడు గ్రామంలో 150 సర్టిఫికెట్లు అందజేసినట్లు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తెలిపారు. సర్పంచ్ చీకట్ల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్. వైస్ ఎంపీపీ ములసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

కొత్తపల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మూలపేటలో సర్పంచ్ కంబాల మౌనిక అన్నారు. మండలంలోని మూలపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అబ్రహం లింకన్ సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీటీసీ అడ్డా పాప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటర్ల జాబితా తయారీపై శిక్షణ


బీఎల్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

కొత్తపల్లి: ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన అంశమని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఈ నెల 21 నుంచి నెల రోజుల పాటు ఇంటింటికీ సర్వే నిర్వహించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. ఈ సర్వేను ప్రతి బీఎల్‌ఓ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ బండి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మట్టి గుట్ట


సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్న మట్టి గుట్ట

సామర్లకోట: పెద్దాపురం రోడ్డు గణపతినగరానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ఉన్న మట్టి గుట్టతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడి కల్వరు నిర్మాణానికి అవసరమైన గొయ్యి తవ్వి మట్టిని వదిలేయడంతో ఈ సమస్య ఎదురవుతోంది. దీనికి తోడు మెహర్ కాంప్లెక్స్ వద్ద మరో కల్వర్టు పనులు జరగడంతో ఆ రోడ్డు మీదుగా ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రికి వెళ్ల వలసిన వారు ఈ కల్వర్టు ఎదురుగా ఉన్న ప్రైవేటు లే అవుట్ రోడ్డులో వెళ్తూ ప్రమాదాల పాలవుతున్నారు. కమిషనర్ జె. రామారావుకు ఈ సమస్య వివరించగా మట్టి తొలగించాలని మున్సిపల్ ఏఈకి సూచించారు.

రికార్డులు ఉంటేనే కేసు నమోదు

సామర్లకోట: మండల పరిధి వేట్లపాలెం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తి రికార్డులు ఉంటేనే కేసు నమోదు చేస్తామని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. పంచాయతీపై వచ్చిన ఆరోపణల మేరకు కేసు నమోదు చేయాలని డీఎల్‌పీఓ అన్నామణి బుధవారం రాత్రి సామర్లకోట పోలీసు స్టేషన్‌కు వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. అయితే దీనికి సంబంధించి పూర్తి ఆధారాలతో రికార్డు జెరాక్స్ అందజేయాలని సీఐ సూచించారు. మాజీ సర్పంచ్ వల్లూరి శేషవేణి, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనులపై అవినీతి ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. ఈ మేరకు మూడు రోజుల్లో రికార్డు జెరాక్స్ కాపీలను తీసుకొని సమర్పిస్తామని డీఎల్‌పీఓ తెలిపారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి


భవిత సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈ కో–ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరావు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న సేవలపై బుధవారం ఆయన పరిశీలించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యాశాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఎంఎల్ శివజ్యోతి, భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

సామర్లకోట: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నియోజకర్గ పరిధిలోని క్రైస్తవులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. లూథరన్ హైస్కూల్ నుంచి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు. పాస్టర్ల సంఘ అధ్యక్షుడు పి.ఆనంద్‌బాబు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ కన్వీనర్ సోనియా, పాస్టర్ల సంఘ నాయకులు బ్లెసింగ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వరుని దర్శించుకున్న కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం భావనారాయణపురం తిరుమలనగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, అర్చకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు.

వలంటీర్లకు వందనం

పథకాలు వివరిస్తూ.. సర్వే చేస్తూ


విజయదుర్గ భర్త నుంచి సర్వే వివరాలు సేకరించిన వలంటీర్ రాణిదేవి

అయోధ్యరామపురం సచివాలయానికి చెందిన వలంటీరు సీహెచ్ రాణిదేవి నిత్యం తనకు కేటాయించిన 50 ఇళ్ల ప్రజల అవసరాలను తెలుసుకొంటూ, వారికి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సర్వే చేస్తు ఉంటారు. జగనన్న సురక్ష పథకం సచివాలయ పరిధిలో వార్డులోనే ఏర్పాటు చేయడంతో ప్రజలకు కావలసిన పథకాలు అందజేస్తున్నట్టు ఆమె వివరిస్తున్నారు. దాంతో తంగవేలు విజయ దుర్గకు అమ్మ ఒడి, కొత్త రేషన్ కార్డు, డ్వాక్రా రుణమాఫీ మంజూరయ్యేలే చేశారు.

“మూడు పథకాలు అందుతున్నాయి”



గత నాలుగేళ్లుగా అమ్మఒడి వచ్చింది. దాంతో పిల్లల చదువుకు భరోసా ఏర్పడింది. రేషన్ కార్డు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో కేలవం 24 గంటలలో రేషన్‌కార్డు వచ్చేలా వలంటీరు కృషి చేసింది. సీఎం జగన్ హామీ మేరకు డ్వాక్రా సంఘ రుణ మాఫీ వచ్చింది. ఒకే కుటుంబంలో మూడు పథకాలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– తంగవేలు విజయదుర్గ, అయోధ్యరామపురం, సామర్లకోట

వలంటీర్లకు వందనం

తిరిగితిరిగి.. అలసి సొలసి..


లబ్ధిదారు అమ్మాజీకి పింఛను అందజేస్తున్న వలంటీరు గృహలక్ష్మి

అర్హత ఉన్నా పింఛన్ కోసం తిరిగి తిరిగి అలసిపోయిన లబ్ధిదారులకు పదో సచివాలయానికి చెందిన వలంటీర్ గృహలక్ష్మి పథకాలు అందజేస్తూ ఎంతో సేవ చేస్తున్నారు. వృద్ధాప్య పింఛను కోసం గత ప్రభుత్వంలో ప్రయత్నం చేసి విసిగిపోయారు. దీనిలో భాగంగా గాంధీచౌక్ వద్ద నివాసం ఉంటున్న దామిశెట్టి అమ్మాజీకి వృద్ధాప్య పింఛను వచ్చేలా వలంటీర్ చేసింది. దాంతో వృద్ధురాలు ముఖంలో చిరునవ్వు కనిపిస్తోంది.

“గత ప్రభుత్వంలో నమ్మకం కోల్పోయాను”



గత తెలుగుదేశం ప్రభుత్వంలో పింఛను కోసం కౌన్సిలర్లు, అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాను. ఇక పింఛను వస్తుందనే నమ్మకంపోయింది. దాంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో వలంటీర్లు ఇంటికి వచ్చి మీకు పింఛను వస్తుందని భరోసా ఇచ్చి ఒకటో తేదీన పింఛను చేతిలో పెట్టారు. దాంతో నా ఆనందానికి అవధులు లేవు. వలంటీర్ రూపంలో దేవుడే వచ్చాడని భావించాను.

– దామిశెట్టి అమ్మాజీ, సామర్లకోట

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కొత్తపల్లి: ప్రతిఒక్కరికీ సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. కొత్తపల్లిలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పిల్లలకు దోమ తెరలు తప్పని సరిగా అమర్చాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలను తినాలని సూచించారు.

రచయిత గౌరీనాయుడికి అరుదైన గౌరవం


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న గౌరీనాయుడు

పిఠాపురం: పిఠాపురం పట్టణానికి చెందిన యువ రచయిత డాక్టర్ కిలారి గౌరీనాయుడికి అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఈ నెల 11 నుంచి 18 వరకూ భారతీయ భాషా సంస్థ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖల సంయుక్త ఆధ్వరంలో నిర్వహించిన సాహిత్య రంగ ప్రతినిధుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యం, కళారంగాల అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా భారతీయ భాషా సంస్థ డైరెక్టర్ ఆచార్య శైలేంద్రమోహన్, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమారాణి, ప్రిన్సిపాల్ రాకేశ్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు గౌరీనాయడును అభినందించారు.

జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరణ


జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, సంఘ నాయకులు

పిఠాపురం: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రజలు జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని ఆ సంఘ గొల్లప్రోలు మండలాధ్యక్షుడు ఏలేటి నానిబాబు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రచార ఉద్యమంలో భాగంగా ప్రజలను చైతన్య వంతులుగా చేయడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, ఉపాధ్యాక్షుడు అనిశెట్టి సీతారామరాజు, కార్యదర్శి చేతులూరి సూరిబాబు, కర్రి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


విరవలో మహాలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించారు. విరవకు చెందిన పడాల మహాలక్ష్మి, పిఠాపురం 21 వార్డు కౌన్సిలర్ కావాలా పోశయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట గండేపల్లి బాబి, బాలిపల్లి రాంబాబు, బండి రవి, చింతాడ నీలవేణి, జవాది నాయుడు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో వీరంగం చేసిన వ్యక్తిపై కేసు

కొత్తపల్లి: మద్యం మత్తులో వీరంగం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన ఎరిపిల్లి అడివిరాజు మద్యం తాగి అమీనాబాదు మార్కెట్ సెంటర్‌లో పలువురు వ్యాపారులతో ఘర్షణకు దిగాడు. సపోటా పండ్లు విక్రయిస్తున్న మహిళ నుంచి భోజనం కేరేజీ లాక్కున్నాడు. దివంగత మాజీ సర్పంచ్ నక్కా అబయ్య విగ్రహానికి ఏర్పాటు చేసిన అద్దాలను పగలగొట్టాడు. పలు విగ్రహాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అతడిపై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

రెండు లారీలు ఢీ

జగ్గంపేట: పదహారో జాతీయరహదారిపై జగ్గంపేట వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైవేపై జగ్గంపేటలో గత మూడు రోజులుగా ఒక లారీ నిలిచిపోయింది. బుధవారం సాయంత్ర పశ్చిమ బెంగాల్ వెళుతున్న లారీ ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో క్లీనర్ డ్రైవింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ క్లీనర్, డ్రైవర్‌ను గాయాలయ్యాయి. వారిని హైవే పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని జగ్గంపేట పోలీసులు తెలిపారు.

పది రోజుల్లో మూడు ప్రమాదాలు

జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో ఆగి ఉన్న లారీలను వెనుక నుంచి వస్తున్న లారీలు ఢీకొన్న ఘటనలు గత పది రోజుల్లో మూడు జరిగాయి. ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జాతీయ రహదారిపై లారీలను నిలపకుండా హైవే పోలీసుల తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డయల్ యువర్ డీఎం

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. డిపో కార్యాలయంలో బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. 13 మంది ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు వివరించి, పలు సూచనలు ఇచ్చారు. పిఠాపురం–సామర్లకోట మధ్య బస్సులు నడపాలని, భానుగుడి వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని, సామర్లకోట, పెద్దాపురం నుంచి రాజహేంద్రవరానికి లిమిటెడ్ హాల్ట్స్ బస్సులు ఏర్పాటు చేయాలని మరికొందరు ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. బస్సులలో వికలాంగుల సీట్లను వారికే కేటాయించేలా చూడాలని కోరారు. రాజహేంద్రవరం–ఉప్పాడ బస్సులు నడపాలని కోరారు. పిఠాపురం–కోనపాపపేట మధ్య బస్సు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.